క్లుప్తంగా

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

తలకొండపల్లి: బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి కర్ణాటక రాష్ట్రం ప్రవాసి ఎమ్మెల్యే భరత్ శెట్టి, పార్టీ సీనియర్ నేతల తల్లోజు ఆచారి హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు, మండల మోర్చా అధ్యక్షులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మల్లేశ్

ఇబ్రహీంపట్నం: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన మేఘనకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. తుర్కగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటకు చెందిన దేవదాసు, ఆండాలు దంపతుల మూడో కుతూరు మేఘన ఎంబీబీఎస్‌లో ర్యాంకు సాధించి ప్రభుత్వ కళాలలో సీటు దక్కించుకుంది. ఈ మేరకు పేద కుటుంబానికి చెందిన మేఘనకు శుక్రవారం క్యామ ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు అబ్బయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. బాధిత కార్మికుడి కుటుంబాన్ని శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు రాములుగౌడ్, నాయకులు యాదయ్య, చంద్రయ్య, హరీశ్, చంద్రమౌళి, నర్సింహ, లక్ష్మయ్య, పార్టీ నాయకులు ఉన్నారు.

బద్నాపూర్‌లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని బద్నాపూర్‌కు చెందిన వెంకటేశ్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గౌడ సంక్షేమ సంఘం కల్వకుర్తి గ్రామ కమిటీ సహకారంతో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాల కుమార్‌గౌడ్, చుక్కా అల్లాజి, నిరంజన్, రవిగౌడ్, సత్యంగౌడ్, కృష్ణయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, శ్రీనుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా బోడ వంశీ, కార్యదర్శిగా మద్దెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా వినయ్, లక్ష్మణ్, కిట్టు, సహాయ కార్యదర్శులుగా తరంగ్, వరలక్ష్మి, మరో 15 మంది సభ్యులున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మస్కు చరణ్, విప్లవకుమార్, వినోద్, దినేశ్, కార్తీక్, శంకర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

మంచాల: రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ఆగాపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మంచాల తహసీల్దార్ వెంకట్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రియల్ వ్యాపారులు వెంచర్ల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, లక్ష్మణ్ గౌడ్, ఎరేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో మెలకువలు తప్పనిసరి

పశువైద్యాధికారి స్ఫూర్తి

కొత్తూరు: పశుపోషణలో రైతులు వైద్యులు ఇచ్చిన మెలకువలు పాటించా లని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి అన్నారు. శుక్రవారం తీగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం ఆమె రైతులకు పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువులు అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని సూచించారు. పశువుల పాకను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, పశువైద్య సిబ్బంది శ్రీలత, మల్లేశ్, రవి, కృష్ణ, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అవార్డు

మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్


శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్

ఆమనగల్లు: ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ఆమనగల్లును స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని మున్సిపల్ కమిషనర్ వి.శ్యాంసుందర్ అన్నారు. 2022 సంవత్సరానికి ఆమనగల్లు మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు లభించిందని అందరి సహకారంతోనే సాధ్యమైనది అన్నారు. 'సాక్షి'తో మున్సిపల్ కమిషనర్ ముఖాముఖి

ప్రశ్న: మున్సిపాలిటీలో ఎన్నివార్డులు..? జనాభా ఎంత..?

జవాబు: మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 15600 ఓటర్లున్నారు. 25,350 మంది జనాభా ఉన్నారు.

ప్రశ్న: కార్యాలయంలో సిబ్బంది ఎంతమంది.?

జవాబు: 20మంది సిబ్బంది ఉండగా 15మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. ఒక అకౌంటెంట్ పోస్టు ఖాళీగా ఉంది.

ప్రశ్న: పారిశుద్ధ్య కార్మికులు ఎంతమంది?

జవాబు: 50మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

ప్రశ్న: చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు ఉన్నాయి?

జవాబు: ఏడు ఆటోలు, రెండు ట్రాక్టర్లతో చెత్త సేకరిస్తున్నారు.

ప్రశ్న: రోజువారీగా ఎంత చెత్త సేకరిస్తున్నారు.?

జవాబు: ప్రతీ రోజు నాలుగు మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నాం. ఈ చెత్తతో తడిచెత్తతో కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నాం.

ప్రశ్న: సీసీ రోడ్లు ఎలా ఉన్నాయి.?

జవాబు: మున్సిపాలిటీ పరిధిలో 12 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం 7కి.మీల సీసీ రోడ్డును నిర్మిస్తున్నాం.

ప్రశ్న: మురుగు కాల్వల పరిస్థితి?

జవాబు: మున్సిపాలిటీ పరిధిలో 7 కి.మీల అంతర్గత మురుగు కాల్వలున్నాయి. 2కి.మీల ఓపెన్ డ్రైనేజీ ఉంది. తండాలు, గ్రామాల్లో నాలుగు కిలోమీటర్ల కచ్చ మురుగు కాల్వలున్నాయి.

ప్రశ్న: పార్కులున్నాయా.?

జవాబు: అయ్యప్ప కొండ వద్ద పార్కు నిర్మాణ పనులు ప్రారంభించగా భూ వివాదంతో ఆగిపోయింది. ఇటీవల పార్క్ కోసం అర ఎకరం భూమి కేటాయించారు. పనులు త్వరలో ప్రారంభిస్తాం. టీయూఎఫ్ఐడీసీ ద్వారా ఆమనగల్లులో రెండు, విఠాయిపల్లి, ముర్తుజపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాలలో ఒక్కో పార్కు చొప్పున నిర్మించనున్నారు.

ప్రశ్న: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారా?

జవాబు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలుసైతం అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఓపెన్ మురుగు కాలువలు, చెత్త ఉన్న ప్రదేశాలలో కెమికల్స్‌ను, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నాం. దోమలు, ఈగల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం.

నాలుగోసారి గెలిపించుకుంటాం

బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్


బీఆర్‌ఎస్ నాయకుల బైక్ ర్యాలీ

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు అవకాశం కల్పించడంతో ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రజల అండదండలతో నాలుగవ సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణ, కిరణ్, ప్రసాద్, శంకర్, పరమేశ్, భీమయ్య, రంజిత్, శివ, రాములు, అప్సర్, అబ్బు, అనీఫ్, అఫ్రోజ్, శ్రీరామ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాటికాపరుల సంఘం నాయకులు

తలకొండపల్లి: ప్రభుత్వం కాటికాపరుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాల ఆ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా ఇన్‌చార్జి గాదె కుమార్‌ల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. 50 ఏళ్లు నిండిన వారికి రూ.5వేల పెన్షన్, మృతి చెందిన వారికి రూ.25లక్షల బీమా, దహన సంస్కరణాలకు తక్షణ సాయంగా రూ.25వేలు శ్మశాన వాటిక కాటికాపరులకు అప్పగించాని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ కేవీ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగం, రామచంద్రయ్య, రాములమ్మ, మల్లేశ్, మాసయ్య, రాములమ్మ, నరసింహ, దేవమ్మ, మహేశ్, రాములు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి స్పెషల్ క్యాంపెయిన్

కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణకు అవకాశం


మాట్లాడుతున్న తహసీల్దార్ అన్వర్

ఇబ్రహీంపట్నం: ఓటు హక్కును పొందేందుకు 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు పేరు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ ఎండీ అన్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 76 పోలింగ్ కేంద్రాల్లో శుక్ర, శనివారం బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు లిస్టులో తప్పొప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపునకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

ఎంపీఓ రఘు


గౌరిపల్లి పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ, ఏఈ, తదితరులు

తలకొండపల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని ఎంపీఓ రఘు అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు సిమెంట్, కాంక్రీట్, ఇసుక, స్టీల్, తదితర మెటీరీయల్‌ను సమ పాళ్లలో వాడుతూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోనలి గౌరిపల్లిలో ఏఈ విద్యాసాగర్‌తో కలిసి పర్యటించారు. ఈ సదర్భంగా పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, మేట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టండి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు నిర్వహించాలని ఉప సర్పంచ్ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. భవనం పైకప్పు పెచ్చులూడుతోందని ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం చిన్నారులకు చార్ట్స్ పంపిణీ చేశారు.

రిజర్వేషన్ల పితామహుడికి నివాళి


బీపీ మండల్‌కు నివాళి అర్పిస్తున్న బీసీ నేతలు

ఇబ్రహీంపట్నం: బీసీ రిజర్వేషన్ల పితామహుడు, బీహార్ మాజీ సీఎం బీపీ మండల్ యాదవ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్వర్‌యాదవ్ మట్లాడుతూ.. పార్లమెంట్‌లో అప్పటి ప్రధాని వీపీ సింగ్‌తో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లును ఆమోదింపజేసిన మహానీయుడు బీపీ మండల్ యాదవ్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ మహాసభ నాయకుడు శ్రీరామ్, బాలరాజు, శ్రీశైలం, సత్యనారాయణ, అజయ్, జంగయ్య పాల్గొన్నారు.

మండల ఏర్పాటుకు దీక్ష

స్పందించని ప్రభుత్వం

తలకొండపల్లి: మండల ఏర్పాటుకు 54 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశా రు. గట్టు ఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కొనసాగిస్తున్న దీక్ష శుక్రవారం 54 రోజులకు చేరింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగానే మండలం ఏర్పా టు అవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలం ఏర్పాటుకు ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు, వార్డు సభ్యులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రేణురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

సర్పంచ్ బక్కి కుమార్


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యులు

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రధనలో సర్పంచ్ బక్కి కుమార్, హైదరాబాద్ పుష్పగిరి ఆస్పత్రి డాక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారుగా 500 మందికి మెడ, కంటి, తల నొప్పులతో పాటు, టెర్రీజియం, కేటరాక్ట్, తదితర ఆపరేషన్లకు పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వినోద్ కుమార్, విజయ, వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరి, రాణి, రాజు, రేణుక, యాదయ్య, వెంకటేశ్, భగవంతు, జంగయ్య, అయప్ప, శ్రీను, రాములు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుటుంబ పార్టీలు

మంగుళూర్ సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్


చౌదరిగూడలో మాట్లాడుతున్న వేదవ్యాస్ కామత్

కొందుర్గు: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు కుటుంబ పార్టీలేనని, ఈ రెండూ తమ కుటుంబ సభ్యులకు ఆస్తులు కూడబెట్టడానికే తప్ప ప్రజాసేవకు పనికిరాని పార్టీలని కర్ణాటక రాష్ట్రం మంగళూర్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదికి దేశ ప్రజలే కుటుంబ సభ్యులని అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని తొమ్మిదేళ్లుగా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా వీధిలైట్లు, పల్లె ప్రకృతివనాలు, రైతు వేదికలు, సీసీ రోడ్లు ఏర్పాటు వంటివి చేసింది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. కరోన సమయంలో ఉచితంగా కరోన టీకాలు, బియ్యం పంపిణీ చేశారన్నారు. ప్రధాని మోదీ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగిరేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్ రెడ్డి, అశోక్ గౌడ్, భూపాలచారి, విజయ్‌కుమార్, మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాసు, సాయిబాబా, శివారెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న భక్తులు, వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న మహిళ

శ్రావణ సందడి


తలకొండపల్లి: అమ్మవారి పూజలో ఎంపీపీ దంపతులు

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ రోజు లక్ష్మీదేవిని పూజిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. మహిళలు ఆలయాల్లో, గృహాల్లో కళశస్థాపన చేసి అమ్మవారిని బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు.

– ఆమనగల్లు జోన్ బృందం


కడ్తాల్: వరలక్ష్మి వ్రతం చేసిన భక్తులు

అర్హులకు బీసీ బంధు ఇవ్వండి

ఎంపీటీసీ సభ్యుడు సురేందర్ రెడ్డి


మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: పేద లబ్ధిదారులను వెంటనే గుర్తించి వారికి బీసీ బంధు మంజూరు చేయాలని కొండకల్ ఎంపీటీసీ బద్దం సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. శంకర్‌పల్లిలో శ్రువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బంధు కోసం 25నుంచి 30మంది దరఖాస్తు చేసుకోగా ఏ ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండకల్, శేరిగూడ గ్రామాల్లో బీసీ, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉంటుందన్నారు. కానీ ఏ ఒక్కరిని గుర్తించి బీసీ బంధు ఇవ్వలేదన్నారు. ఇక మైనార్టీ బంధు కూడా దిక్కు లేదన్నారు. దళిత బంధు కూడా అందలేదన్నారు. పెన్షన్ల కోసం సుమారు 60మంది దరఖాస్తు చేసుకొని రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికి అతిగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఎమ్మెల్యే యాదయ్య స్పందిచి సమస్యలను పరిష్కరించకపోతే రాజీనామ చేయడానికి కూడా తాము వెనుకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. రామంతపురంలో రూ.11లక్షలతో అండర్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలోని వార్డుల్లో సీసీ రోడ్లకు, అండర్ డ్రైనేజీ ఏర్పాటునకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ చాకలి శోక్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, కో ఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కావలి గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

ఓటు మనదే.. సీటు మనదే

- టికెట్ ఇవ్వని బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి
- ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అంచ రాములు


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

షాద్‌నగర్‌రూరల్: ముదిరాజులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించని బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అంచరాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కుడుములబాల్‌రాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంచరాములు, ఉపాధ్యక్షుడు మంగవెంకటేశ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. అనంతరం అంచరాములు మాట్లాడుతూ...తక్కువ జనాభా ఉన్న అగ్రకుల నాయకులకు ఎక్కువ సీట్లు కేటాయించి, అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు ఒక్క టికెట్‌కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు 60 లక్షలకు పైగా ఉన్నారని, నియోజకవర్గంలో సుమారు 50వేలకుపైగా ఉన్నామన్నారు. ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండి 'మన ఓటు మన సీటు' నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో మంగమధు, గుంటిశంకర్, కావలిశ్రీశైలం, బుడ్డనర్సింహ్మ, సత్యనారాయణ, ప్రశాంత్, యాదయ్య, జంగయ్య, రవి, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

ఏటీడబ్ల్యూ సహకారంతో వాటర్‌ప్లాంట్

లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ అనిత

షాబాద్: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మరావుగూడలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో (ఏటీడబ్ల్యూ) ఎనీ టైం వాటర్ ప్లాంట్‌ను సంస్థ సీనియర్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె ప్రాంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, సత్తయ్య, కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.